
# రంగంలోకి అగ్రరాజ్యాలు!

- ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధంతో అమెరికా, రష్యా మధ్య ఉద్రిక్తతలు
- యుద్ధం ముగింపునకు మధ్యవర్తిత్వం వహిస్తానన్న రష్యా అధ్యక్షుడు పుతిన్
- ఉక్రెయిన్ యుద్ధంపై ముందు మీరు మధ్యవర్తిత్వం చేసుకోండని ట్రంప్ చురక
- యుద్ధంలోకి అమెరికా దిగితే తీవ్ర పరిణామాలు తప్పవని రష్యా వార్నింగ్





న్యూఢిల్లీ: ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్నది. రెండు అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా మధ్య పెను ఉద్రిక్తతలకు ఇది కారణమవుతున్నది. రెండు దేశాలు చెరో పక్షాన నిలుస్తుండటంతో ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందేమోనన్న ఆందోళన ప్రపంచ దేశాలలో వ్యక్తమవుతున్నది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సయోధ్య కుదర్చడానికి మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధమని రష్యా అధ్యక్షుడు పుతిన్ బుధవారం ప్రకటించారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించుకునేందుకు వీలుగా ఒక ఒప్పందం కుదర్చడంలో తాను సాయపడతానని పుతిన్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ ముందుగా ఉక్రెయిన్‌తో సాగిస్తున్న తన సొంత యుద్ధానికి పుతిన్ ముగింపు పలకాలని వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు బహిరంగ మద్దతు ప్రకటించిన ట్రంప్ తన సైనిక బలగాలను పశ్చిమాసియాలో అదనంగా మోహరించడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే తాము కూడా యుద్ధంలో చేరతామని రష్యా గురువారం ప్రకటించింది. ఆ రెండు దేశాల మధ్య ఘర్షణలు ఉగ్ర రూపం దాలుస్తున్న పరిస్థితులలో అమెరికా సైన్యం జోక్యం చేసుకోవడం అత్యంత ప్రమాదకరమని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖారోవా హెచ్చరించారు. ఇది అనూహ్యమైన ప్రతికూల పరిణామాలకు దారి తీయగలదని ఆమె అమెరికాను హెచ్చరించారు.

**రెండు వారాల్లోగా నిర్ణయం: వైట్‌హౌజ్**

ఇరాన్‌పై దాడి చేయాలా వద్దా అన్నదానిపై ట్రంప్ రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోనున్నట్టు శ్వేతసౌధం తెలిపింది.



## ఇజ్రాయెల్ దవాఖానపై ఇరాన్ దాడి

దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఓ ప్రధాన దవాఖానపై గురువారం తెల్లవారుజామున ఇరాన్ జరిపిన క్షిపణి దాడి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. అయితే తీవ్రమైన గాయాలు ఎవరికీ కాలేదని దవాఖాన యాజమాన్యం ప్రకటించింది. కాగా, టెల్ అవీవ్ సమీపంలోని అనేక బహుళ అంతస్తుల భవనాలు, ఇతర నివాస భవనాలపై ఇరాన్ క్షిపణులు దాడి చేశాయి. ఈ దాడులలో కనీసం 47 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ మాగెన్ డేవిడ్ ఆడమ్ రెస్క్యూ సర్వీస్ తెలిపింది. బీర్‌షెబా నగరంలోని సొరోకా వైద్య కేంద్రంపై క్షిపణి దాడి జరగడంతో దట్టమైన నల్లని పొగ ఆ ప్రాంతంలో వ్యాపించింది. దవాఖానలోని రోగులను ఎమర్జెన్సీ బృందాలు వేరే దవాఖానలకు తరలించాయి. బీర్‌షెబాలోని ప్రధాన దవాఖానపై ఇరాన్ క్షిపణి దాడి జరిగిందని ఇద్దరు వైద్యులు అసోసియేటెడ్ ప్రెస్‌కి తెలిపారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్లు ఆగిపోయిన వెంటనే దవాఖానపై క్షిపణి దాడి జరిగిందని వారు చెప్పారు. సురక్షిత గది నుంచి కూడా తమకు భారీ శబ్దాలు వినిపించాయని వారు తెలిపారు. కొన్ని రోజుల క్రితం రోగులను వేరే చోటుకు తరలించిన పాత సర్జరీ భవనం క్షిపణి దాడిలో ధ్వంసమైందని దవాఖాన యాజమాన్యం తెలిపింది. విషమ పరిస్థితులలో ఉన్న రోగులను ఉంచుకుని మిగిలిన రోగులందరినీ వేరే దవాఖానాలకు తరలించామని వారు చెప్పారు. సొరోకా వైద్య కేంద్రంలో 1,000కిపైగా పడకలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో నివసిస్తున్న 10 లక్షల మందికి పైగా ప్రజలకు ఈ దవాఖాన ప్రధానంగా వైద్య సేవలు అందిస్తున్నది.

**గట్టి జవాబు ఇస్తాం: నెతన్యాహు**

సొరోకా వైద్య కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడిని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. దీనికి గట్టి జవాబు ఇస్తామని ఆయన ప్రకటించారు. టెహ్రాన్‌లోని నిరంకుశులు దీనికి భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

**వార్డులుగా మారిన భూగర్భ పార్కింగ్**

దవాఖానపై జరిగిన దాడిలో చాలామందికి స్వల్ప గాయాలయ్యాయని స్థానిక పోలీసు కమాండర్ హయిమ్ బుబ్లిల్ విలేకరులకు తెలిపారు. ఇజ్రాయెల్‌లోని చాలా దవాఖానలు గత వారం అత్యవసర వార్డులను తెరిచాయి. అండర్‌గ్రౌండ్ పార్కింగ్ ప్రదేశాలను దవాఖాన వార్డులుగా మార్చివేసిన యాజమాన్యాలు రోగులను ముఖ్యంగా వెంటిలేటర్లపైన ఉన్న రోగులు, కదలడానికి వీల్లేని స్థితిలో ఉన్న వారిని తరలించి చికిత్స అందచేస్తున్నారు.

**దవాఖానపై దాడి లక్ష్యం కాదు: ఇరాన్**

దవాఖానపై క్షిపణి దాడి తమ లక్ష్యం కాదని ఇరాన్ గురువారం ప్రకటించింది. దవాఖాన సమీపంలో ఉన్న సైనిక, నిఘా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని తాము క్షిపణిని ప్రయోగించినట్లు ఇరాన్ వివరించింది. సొరోకా దవాఖాన సమీపంలో ఉన్న గవ్ యామ్ టెక్నాలజీ పార్కులో ఉన్న ఇజ్రాయెల్ ఆర్మీ కమాండ్, ఇంటెలిజెన్స్ బేస్(ఐడీఎఫ్ సీ41), ఆర్మీ ఇంటెలిజెన్స్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని తాము దాడి చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఇర్నా పేర్కొంది.

## ఖమేనీ బతకడానికి వీల్లేదు: ఇజ్రాయెల్

ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ బతకడానికి వీల్లేదని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. టెల్ అవీవ్ సమీపంలోని ఓ దవాఖానపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంపై గురువారం ఆయన తీవ్రంగా స్పందించారు. దవాఖానపై జరిగిన క్షిపణి దాడికి ఖమేనీ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. బంకర్‌లో తలదాచుకున్న ఇరానియన్ నియంత ఇజ్రాయెల్‌లోని దవాఖానలు, నివాస భవనాలపై పిరికిపందలా క్షిపణులతో దాడులు చేస్తున్నారని కట్జ్ ఆరోపించారు. ఇవి చాలా తీవ్రమైన యుద్ధ నేరాలని, ఈ నేరాలకు ఖమేనీని జవాబుదారీగా నిలబెడతామని హెచ్చరించారు. ఖమేనీని అంతం చేయడానికి ఇజ్రాయెల్ రక్షణ దళాలు(ఐడీఎఫ్) ఎంత దూరం వెళ్లడానికైనా సిద్ధమని ఆయన ప్రకటించారు. ఖమేనీ పాలనను అంతం చేసేందుకు దాడులను ముమ్మరం చేయాలని తాను, ప్రధాని నెతన్యాహు ఐడీఎఫ్‌ని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## ఇరాన్ అణు రియాక్టర్ ధ్వంసం

ఇరాన్‌లోని అరాక్ భార జల పరిశోధనా రియాక్టర్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడి చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ గురువారం ధ్రువీకరించింది. క్షిపణి దాడి జరిగిన సమయంలో అరాక్ రియాక్టర్ అణు సామర్థ్యాన్ని కలిగి లేదని, రేడియోధార్మిక విషవాయువు ముప్పు ఏదీ ప్రజలకు లేదని టీవీ ప్రకటించింది. ఈ దాడి జరగడానికి ముందుగానే అణు కేంద్రాన్ని ఖాళీ చేసినట్లు తెలిపింది. కాగా తాము అరాక్ రియాక్టర్‌పై దాడి చేయనున్నామని, ప్రజలు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని గురువారం తెల్లవారుజామునే ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీచేసింది. రియాక్టర్ కేంద్రం నిర్వహణలో లేదని, అణు పదార్థం కాని, రేడియోధార్మిక ప్రభావం కాని ఏమీ లేదని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ(ఐఏఈఏ) వెల్లడించింది. రియాక్టర్‌ని ఆనుకునే ఉన్న భార జల కర్మాగారంపై దాడి జరిగిన విషయం గురించి తమకు సమాచారం అందంచలేదని ఐఏఈఏ తెలిపింది. కాగా, అరాక్ రియాక్టర్‌పై తాము జరిపిన క్షిపణి దాడి ఫొటోలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. రియాక్టర్ భవనంపైన బాంబు పడుతున్న దృశ్యాలు, భారీ పేలుడు కారణంగా మంటలు ఏర్పడి దట్టమైన పొగ వ్యాపించిన దృశ్యాలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. యురేనియం ఉత్పత్తి కోసం అరాక్ రియాక్టర్‌ను ఉపయోగించకూడదన్న ఉద్దేశంతోనే దానిపై తమ ఫైటర్ జెట్లు దాడి జరిపినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది.



## ఇరాన్‌లో పాలన మార్పు మా లక్ష్యం కాదు.. కానీ

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు**

టెల్ అవీవ్, జూన్ 19: ఇరాన్ పాలకుల పతనం ఇజ్రాయెల్ లక్ష్యం కానప్పటికీ ఇప్పుడు సంఘర్షణ పర్యవసానంగా అది జరుగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. ఇజ్రాయెల్ మీడియాతో ఆయన మాట్లాడుతూ పాలన మార్పు అన్నది ఇరాన్ ప్రజలకు సంబంధించిన విషయమని, అది తమ అజెండా మాత్రం కాదని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ సంఘర్షణతో ఇరాన్‌లో ప్రస్తుత ప్రభుత్వం పడిపోవడం లేదా కొత్త పాలకులు రావడాన్ని ఇరాన్ ప్రజలు చూస్తారని, దీనికి ప్రత్యామ్నాయం లేదని ఆయన అన్నారు. అందుకే దానిని తాము ఒక లక్ష్యంగా చూడటం లేదని, జరగబోయే పరిణామంగా భావిస్తున్నామని అన్నారు.

## ఇరాన్‌పై ఇజ్రాయెల్ భారీ సైబర్ దాడి

**క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ నుంచి 90 మిలియన్ డాలర్లు అపహరణ**

దుబాయ్, జూన్ 19: ఇజ్రాయెల్ భౌతిక దాడులతో అల్లాడుతున్న ఇరాన్‌పై ఇప్పుడు భారీ సైబర్ దాడి జరిగింది. ఇజ్రాయెల్‌తో సంబంధాలున్నట్టు అనుమానిస్తున్న కొందరు హ్యాకర్లు ఇరాన్‌లోని అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్‌పై దాడి చేసి 90 మిలియన్ల యూఎస్ డాలర్లను కొల్లగొట్టినట్టు బ్లాక్‌చెయిన్ అనలిటిక్స్ సంస్థలు వెల్లడించాయి. హ్యాకింగ్‌కు బాధ్యత వహించిన గ్రూప్ గురువారం కంపెనీ పూర్తి సోర్స్ కోడ్‌ను లీక్ చేసింది. 'నోబిటెక్స్‌లో మిగిలి ఉన్న ఆస్తులు ఇప్పుడు పూర్తిగా అందుబాటులో ఉన్నాయి' అని ఆ గ్రూప్ టెలిగ్రామ్ ఖాతాలో రాసింది. ఇరాన్ వేగంగా నిర్వహిస్తున్న అణు కార్యక్రమంపై విధించిన పాశ్చాత్య ఆంక్షలను తప్పించుకోవడానికి, ఉగ్రవాదులకు డబ్బును బదిలీ చేయడానికి నోబిటెక్స్ సహాయపడిందని 'దోపిడీ పిచ్చుక' పేరుతో వారు ఎక్స్‌లో ప్రకటన చేశారు. కాగా, సైబర్ దాడిని నోబిటెక్స్ నిర్ధారించింది.



## ఇరాన్ నుంచి సురక్షితంగా స్వదేశానికి

**ఢిల్లీకి చేరుకున్న 110 మంది భారత విద్యార్థులు**

న్యూఢిల్లీ: యుద్ధంతో అట్టుడుకున్న ఇరాన్ నుంచి తుర్క్‌మెనిస్థాన్, అర్మేనియాకు తరలించిన 110 మంది భారతీయ విద్యార్థులు సురక్షితంగా గురువారం స్వదేశానికి చేరుకున్నారు. ఆపరేషన్ సింధులో భాగంగా వీరిని తుర్క్‌మెనిస్థాన్, అర్మేనియా ప్రభుత్వాల సాయంతో న్యూఢిల్లీకి విమానంలో తీసుకొచ్చినట్టు విదేశాంగ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. మరింత మంది భారత విద్యార్థులను ఇరాన్ నుంచి ఖాళీ చేయించి స్వదేశానికి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకొంటున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు భారత్, తుర్క్‌మెనిస్థాన్, అర్మేనియా ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధం సందర్భంగా ఇరాన్‌లో నెలకొన్న భయానక పరిస్థితులను పంచుకున్నారు. వచ్చినవారిలో కశ్మీర్ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు.

## ఇజ్రాయెల్‌లోని మన పౌరులను రప్పించేందుకు నిర్ణయం

న్యూఢిల్లీ: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తీవ్ర అనిశ్చితి పరిస్థితులు నెలకొనడంతో ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ దేశాన్ని వీడాలనుకుంటున్న భారతీయులను స్వదేశానికి రప్పించాలని నిర్ణయించింది. ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌లోని బీర్‌షెబాలోని హాస్పిటల్‌ను ధ్వంసం చేసిన క్రమంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. ఆ దేశం నుంచి రావాలనుకునే వారిని తొలుత భూభాగ సరిహద్దుల ద్వారా సురక్షిత ప్రాంతానికి తీసుకుని వెళ్లి, అక్కడి నుంచి విమానాల ద్వారా భారత్‌కు తీసుకుని వస్తామని విదేశాంగ శాఖ తెలిపింది. ఇప్పటికే ఆపరేషన్ సింధు కింద ఇరాన్‌లో చిక్కుకుపోయిన మన పౌరులను భారత్‌కు తీసుకుని వస్తున్నట్టు పేర్కొంది. కాగా, యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయులు ఆ దేశ అధికారులు జారీ చేసే సూచనలు, ఆదేశాలను తప్పక పాటించాలని టెల్ అవీవ్‌లోని భారత ఎంబసీ సూచించింది.

# అమెరికా యుద్ధ సన్నాహాలు!

- పశ్చిమాసియాకు అదనంగా అమెరికా సైనిక బలగాలు
- బంకర్ బస్టర్లు, బాంబర్లు, యుద్ధ నౌకల తరలింపు
- ఇరాన్ గగనతలం పూర్తిగా మా అధీనంలో: ట్రంప్




డూమ్స్‌డే విమానం

న్యూఢిల్లీ, జూన్ 19: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంతో పశ్చిమాసియాలో తన సైనిక బలగాలను అమెరికా మోహరిస్తున్నది. ఇరాన్ దాడుల నుంచి ఇజ్రాయెల్‌ను రక్షించి, ఆ ప్రాంతంలోని అమెరికా దళాలను కాపాడే లక్ష్యంతో అమెరికా ఈ చర్యలు చేపట్టింది. పశ్చిమాసియాలో అమెరికా సైనిక బలగాల మోహరింపు నిజమేనని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ధ్రువీకరించారు. తమ ప్రజల భద్రత కోసమే ఈ చర్యలని ఆయన తెలిపారు. పశ్చిమాసియాలోని వ్యూహాత్మక ప్రదేశాలకు అదనంగా ఫైటర్ జెట్లు, రీఫ్యూయెలింగ్ ట్యాంకర్లు, యుద్ధ నౌకలను అమెరికా రక్షణ శాఖ పంపించి రానున్న రోజుల్లో తమ ప్రమేయం కూడా ఉంటుందన్న సూచనలు పంపింది. ఇరాన్ గగనతలంపై ఇప్పుడు తమకు పూర్తి నియంత్రణ ఏర్పడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా గురువారం ప్రకటించారు. ఇరాన్‌లోని అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులకు ఆస్కారం ఉందని ఆయన సూచన ప్రాయంగా వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు అమెరికా యుద్ధ విమానాలేవీ ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించలేదని అమెరికన్ అధికారులు స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌పై దాడి చేస్తున్న ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడమే లక్ష్యంగా ఇప్పటి వరకు కార్యకలాపాలు సాగుతున్నాయని వారు చెప్పారు.

**అమెరికన్ బాంబర్లు మోహరింపు**


సౌదీ అరేబియాలో అమెరికాకు చెందిన డజను ఎఫ్-16 విమానాలను మోహరించగా పశ్చిమాసియా వ్యాప్తంగా అమెరికా ఫైటర్ జెట్లు విహంగ పర్యవేక్షణ చేస్తున్నాయి. బీ-52 బాంబర్లు డైగో గార్షియాలో సిద్ధంగా ఉన్నప్పటికీ అత్యంత శక్తివంతమైన బంకర్ బస్టర్ బాంబుగా పిలిచే బీ-2 స్టెల్త్ బాంబర్స్‌ని చివరి అస్త్రంగా ఇప్పటి వరకు మోహరించలేదు. పర్వతాల కింద లోతుగా భూగర్భంలో ఇరాన్ నిర్మించిన ఫోర్డో అణు కేంద్రాన్ని ధ్వంసం చేసే శక్తి గల జీబీయూ-57 క్షిపణిని అమెరికా ప్రయోగించవచ్చని అమెరికా అధికారులు వెల్లడించారు. ఫోర్డో అణు కేంద్రాన్ని ధ్వంసం చేసేందుకు అవసరమైన విమానం, మందుగుండు అమెరికా వద్ద ఉందని వారు చెప్పారు. బ్రిటన్, స్పెయిన్, జర్మనీ, గ్రీస్‌తోసహా యూరపు వ్యాప్తంగా వ్యూహాత్మక ప్రదేశాలలో అదనంగా రీఫ్యూయలింగ్ విమానాలు, ఫైటర్ జెట్లను అమెరికా వైమానిక దళం మోహరించినట్లు పశ్చిమాసియాలో రియల్ టైమ్‌లో లభించే సమాచారాన్ని సమీక్షించే అరోరా ఇంటెల్ అనే గ్రూపు తెలిపింది.

## వాషింగ్టన్‌కు డూమ్స్‌డే విమానం

ఇరాన్‌పై దాడికి ట్రంప్ తర్జనబర్జనలు పడుతున్న వేళ, వాషింగ్టన్‌కు డూమ్స్‌డే విమానం చేరుకోవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నైట్‌వాచ్ అని పిలుస్తారు. అమెరికా కీలక మంత్రులు, అధికారులను రక్షించేందుకు దీన్ని నిర్మించారు. అణుదాడి సమయంలో అమెరికా రక్షణ మంత్రి సహా కీలక కార్యవర్గం అత్యధిక సమయంలో గాల్లో ఉండేందుకు నిర్మించిన ఫ్లయింగ్ కమాండ్ సెంటర్ ఇది.

# హర్మూజ్‌ను మూసేస్తాం!

- ప్రపంచ దేశాలకు ఇరాన్ హెచ్చరిక
- ప్రపంచ చమురు రవాణాకు ఈ జలసంధి జీవనాడి
- రవాణాను ఇరాన్ ఆపేస్తే ప్రపంచ దేశాలపై పెను ప్రభావం




న్యూఢిల్లీ, జూన్ 19: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ పశ్చిమాసియాలోని ఓ సన్నని జల రవాణా మార్గం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు ఉండే హర్మూజ్ జల సంధి ప్రపంచంలోనే అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గమని చెప్పవచ్చు. ఈ మార్గాన్ని అడ్డుకోవాలని ఇరాన్ నాయకులు మళ్లీ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఇంధనంపై ఆధారపడిన భారత్‌తోసహా అనేక దేశాలు తాజా పరిణామాలపై ఆందోళన చెందుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులు ప్రారంభించిన తర్వాత హర్మూజ్ జలసంధిని మూసివేయాలని పలువురు ఇరానియన్ పార్లమెంట్ సభ్యులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డు కోర్ సీనియర్ కమాండర్, పార్లమెంట్ సభ్యుడు ఇస్మాయిల్ కౌసరి ధ్రువీకరించినట్లు ఈరోన్యూస్ వెల్లడించింది. శత్రువును శిక్షించే విషయంలో తమ చేతులు విశాలంగా ఉంటాయని, తమ ప్రతిస్పందనలో సైనిక చర్యలు ఓ భాగం మాత్రమేనని ఆయన చెప్పారు. గతంలో కూడా ఇరాన్ ఈ విధమైన బెదిరింపులకు పాల్పడినప్పటికీ వాటిని ఆచరణలోకి మాత్రం తీసుకురాలేదు. అయితే ప్రస్తుత యుద్ధ పరిస్థితి భిన్నంగా ఉండడంతో ఇరాన్ చేస్తున్న బెదిరింపులు చాలా దేశాలను ఆలోచనలో పడేస్తున్నాయి.

**హర్మూజ్ జలసంధి అంటే?**

పర్షియన్ గల్ఫ్‌ని అరేబియా సముద్రానికి కలుపుతుంది హర్మూజ్ జలసంధి. ఇరాన్, ఒమన్ మధ్య తక్కువ వెడల్పుతో ఉండే సముద్ర కారిడార్ ఇది. సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, యూఏఈ, ఖతార్, ఇరాన్ వంటి ఇంధన సంపన్న దేశాల నుంచి ముడి చమురు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్(ఎల్ఎన్‌జీ) ఈ జలమార్గంలోనే ప్రధానంగా ఎగుమతి జరుగుతుంది. ప్రపంచానికి సరఫరా అయ్యే చమురులో దాదాపు 25 శాతం ఈ మార్గం ద్వారా వెలుపలికి వెళుతుందని అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ(ఐఈఏ) తెలిపింది. తమపై దాడి చేస్తే ఈ హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ పదేపదే హెచ్చరిస్తోందని, ఈ జలసంధి కొద్ది కాలం మూతపడినా ప్రపంచ వ్యాప్తంగా చమురు, సహజవాయువు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఐఈఏ హెచ్చరించింది. హర్మూజ్ జలసంధి ఇరాన్ సముద్ర జలాలలో 20 నాటికల్ మైళ్లు ఉంటుంది. ఈ సముద్ర మార్గంలో నెలకు 3,000కి పైగా వాణిజ్య నౌకలు ప్రయాణిస్తాయి.

# ఇరాన్ మిత్రులెక్కడ?

- బాగ్దాద్ నుంచి బీరుట్ వరకు అంతా గప్‌చుప్
- జాడలేని హిజ్బొల్లా, హమాస్, హౌతీలు
- ఒంటరిగా మిగిలిన ఇరాన్



ఖమేనీ

న్యూఢిల్లీ, జూన్ 19: లెబనాన్‌లో హిజ్బొల్లా, పాలస్తీనాలో హమాస్, యెమెన్‌లో హౌతీలు, ఇరాక్‌లో షియా తీవ్రవాద గ్రూపులు.. ఇవన్నీ ఇరాన్‌కు మిత్రులే.. ఇజ్రాయెల్‌కు శత్రువులుగా ఉన్న వీటికి ఇరాన్ ఆర్థిక, ఆయుధ సాయం కూడా అందిస్తున్నది. నాలుగు దశాబ్దాలుగా పశ్చిమాసియా అంతటా ఇరాన్ వీటన్నింటితో కలిపి ప్రచ్ఛన్న దళాలను నిర్మించింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో తాను నేరుగా తలపడకుండా ఇరాన్ వీటిని ఎగదోస్తున్నది. కానీ ప్రస్తుతం కష్టకాలంలో ఉన్న ఇరాన్‌కు ఇవన్నీ కంటికి కానరానంత దూరంలో ఉండిపోయాయి. ఊపిరి కూడా తీసుకోనివ్వకుండా ఇజ్రాయెల్ విరుచుకుపడుతున్న తరుణంలో ఈ ఇరాన్ మిత్ర సంస్థలన్నీ అనుమానాస్పద రీతిలో మౌనం వహిస్తున్నాయి. వీటిలో కొన్ని సంస్థలు గ్రూపులుగా విడిపోయాయి, మరికొన్ని తీవ్రంగా బలహీనపడ్డాయి, అంతర్గత పోరుతో సతమతమవుతున్నాయి. దీంతో ఇరాన్ ఒంటరిగా మిగిలిపోయినట్టు తెలుస్తున్నది.

**బలహీనపడిన మిత్రులు**

ఇరాన్‌కు అత్యంత శక్తిమంతమైన మిత్రునిగా ఉన్న షియా పారామిలిటరీ గ్రూపు హిజ్బొల్లా సంస్థ ఇంతవరకు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఎటువంటి చర్య చేపట్టలేదు. ఏడాది క్రితం ఎంతో శక్తిమంతంగా ఉన్న హిజ్బొల్లాను ఇజ్రాయెల్ గత ఏడాది చావు దెబ్బ కొట్టింది. హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై హిజ్బొల్లా సంస్థ రాకెట్లు ప్రయోగించింది. దీంతో హిజ్బొల్లాకు సుదీర్ఘ కాలం నాయకునిగా ఉంటూ వచ్చిన హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. ఆయన స్థానంలో నాయకుడిగా ఎంపికైన నయీం ఖాస్సెమ్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఇరాన్ మిత్రునిగా కాకుండా లెబనాన్ ప్రతినిధిగానే మాట్లాడారు. ఆయన కార్యాలయంలో ఇరాన్ నాయకుడు ఖమేనీ చిత్రపటం అదృశ్యమైందని అమెరికా వార్తా పత్రిక పేర్కొంది. ఇరాన్ నుంచి అన్ని రకాలుగా సాయం పొందిన హమాస్ సంస్థ గత రెండేండ్లుగా ఇజ్రాయెల్‌తో పోరాటంలో పూర్తిగా విచ్ఛిన్నమైపోయింది. దాని సీనియర్ నేతలందరూ హతమయ్యారు. ఇక ఇరాక్‌లో ఇరాన్‌కు మిత్రులుగా ఉన్న షియా తీవ్రవాద గ్రూపులు గత జనవరి వరకూ అమెరికన్ సైనికులను వేధించేందుకు ఉపయోగపడ్డారు. కానీ జనవరిలో ఇరాన్ భూభాగంపై ఇజ్రాయెల్ బాంబులు వేయడంతో వీరంతా మన్ను తిన్న పాములా మారిపోయారు. ఇక యెమెన్‌లోని హౌతీలను గత మార్చి, ఏప్రిల్ నెలల్లో అమెరికా వైమానిక దాడులు చేసి పూర్తిగా నిర్వీర్యం చేసింది.

**అగ్రదేశాలు ఎటు?**

ఇరాన్‌కు పశ్చిమాసియా వెలుపల కూడా బలమైన మిత్రులు ఉన్నారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలు ఇరాన్‌కు మిత్రులే కాకుండా అత్యంత శక్తిమంతమైనవి కూడా. కానీ ప్రస్తుతం రష్యా ఆచితూచి స్పందిస్తున్నది. అది ఇంతవరకు ఇజ్రాయెల్ దాడులను ఖండించడం వరకే పరిమితమైంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నుంచి భారీగా చమురును కొనుగోలు చేస్తున్న చైనా పరోక్షంగా ఆ దేశానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నది. కానీ ప్రస్తుతం అది మధ్యవర్తిత్వం వహించడానికే మొగ్గు చూపుతున్నది. ఇరాన్ అణు కార్యక్రమానికి, క్షిపణుల ఉత్పత్తికి సహాయపడినట్టు ఆరోపణలున్న ఉత్తరకొరియా మాత్రం ఇంతవరకు తన వైఖరిని వెల్లడించలేదు. భారత్ ఇటు ఇరాన్‌తో అటు ఇజ్రాయెల్‌తో సంబంధాలను నెరుపుతున్నది. ఇజ్రాయెల్‌తో అనేక రంగాల్లో భాగస్వామిగా ఉన్న భారత్ ఇరాన్‌కు ప్రాంతీయ, వ్యూహాత్మకంగా భాగస్వామిగా ఉన్నది. ఇరాన్‌లోని పోర్టును అభివృద్ధి చేసేందుకు కాంట్రాక్టును సైతం కుదుర్చుకున్నది.